మంచి మాట

ఎదుటివారు నీలో తప్పులు చూపారని తల్లడిల్లిపోకు. నీకు మంచే చేశారని భావించి, తప్పులు సరిచేసుకుని తల పైకెత్తుకుని తిరుగు.

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY


తెలుగు దిన పత్రిక...

శుక్రవారం, 06 మార్చి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 108


## రెండు రాజ్యసభ స్థానాల భర్తీపై సస్పెన్స్‌కు

# తెరదించిన కాంగ్రెస్

- ముగిసిన రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ
- రాష్ట్రం నుంచి అభిషేక్ మనుసింఘ్వి, వేం నరేందర్‌రెడ్డి ఖరారు
- మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో నామినేషన్లు దాఖలు



**హైదరాబాద్, మార్చి 05:** కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వి, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. సింఘ్వి.. మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా.. వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించను న్నారు. ఎమ్మెల్యేల సంతకాలు లేని ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరిం చనున్నారు.దాంతో అభిషేక్ మను సింఘ్వి, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థులు నిలవ నున్నారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బరిలో నిలపలేదు. దీంతో వీరిద్దరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. గతంలో తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లిన అభిషేక్ మను సింఘ్వి పదవి కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది.అలాంటి వేళ ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మరోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఇక తెలంగాణ నుంచి మరో రాజ్యసభ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. దాదాపు 16 మంది పోటీ పడ్డారు. ఈ రాజ్యసభ స్థానం ఎవరికి దక్కుతుందంటూ ఉత్కంఠ నెలకొంది. అందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. పార్టీ అగ్రనేతలతో వరుస భేటీలు అయ్యారు. చివరకు వేం నరేందర్ రెడ్డిని ఈ పదవి వరించింది.

## సమస్యలకు సైనిక చర్యలు పరిష్కారం కాదు

# యుద్ధాలకు ముగింపు పలకాలి

- సైనిక చర్యలతో సమస్యలకు పరిష్కారం రాదన్న ప్రధాని
- శాంతి, సంభాషణ, రాజనీతికే భారత్ ప్రాధాన్యం
- ఫిన్లాండ్‌తో డిజిటల్, సస్టైనబిలిటీ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం



**న్యూ ఢిల్లీ :**ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని అన్నారు.దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్?తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉంది. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయి" అని తెలిపారు.పరస్పర గౌరవం ద్వారా సమస్యలను!ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధమైనా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని, శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, పరస్పర గౌరవం, శాంతియుత జీవనం ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని సూచించారు ప్రధాని.

## రాజ్యసభ అభ్యర్థిగా బిహార్ సీఎం నీతీశ్ కుమార్

# నామినేషన్



**పాట్నా:** బీహార్ సీఎం నితీశ్ కుమార్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు.నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్దాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞలు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు.తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఒమన్ పోర్టుపై ఇరాన్ దాడి ఇద్దరు భారతీయులు మృతి



ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా మొదలుపెట్టిన దాడులు ఆరో రోజు కొనసాగుతున్నాయి. రాజధాని టెహ్రాన్‌పై మరో దఫా వైమానిక దాడులు మొదలుపెట్టామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ తెలిపింది. ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాల లక్ష్యంగా దాడులు చేస్తున్నామని ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇజ్రాయెల్, అమెరికా దాడులతో విరుచుకుపడుతుంటే ఇరాన్ కూడా అంతే ధాటిగా ప్రతిదాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ సహా అనేక గల్ఫ్ దేశాలపై వందలాది డ్రోన్లు, మిసైళ్లతో తెగపడుతోంది. పశ్చిమాసియాలోని మౌలిక వసతులే లక్ష్యంగా ప్రతాపం చూపుతోంది.ఖతార్ రాజధాని దోహా నగరం భారీ పేలుళ్లతో దద్దరిల్లింది. ప్రయోగించిన క్షిపణులను ఖతార్ వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో భారీ శబ్దాలు వినిపించాయి.

# పాపులేషన్ మేనేజ్‌మెంట్ కొత్త పాలసీ



**అమరావతి, మార్చి 5:** ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని ఇవాళ శాసనసభలో ప్రకటిస్తున్నామన్నారు సీఎం. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు సీఎం. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(×ఎఖీ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు

# కూలగొట్టుడేనా.



**హైదరాబాద్** రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. 'ఇందిరమ్మ రాజ్యం అంటే ఇండ్లు కూలగొట్టుడేనా..?' అని ఆయన ప్రశ్నించారు. ఇండ్లు కూలగొట్టకుండా కూడా మూసీని అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక్క ఇల్లు కట్టలేదుగానీ ఉన్న ఇండ్లు కూలగొడుతున్నాడని మండిపడ్డారు.కేసీఆర్ హయాంలోనే రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టి హైదరాబాద్ అంతటా నీటి శుద్ధీకరణ ప్లాంట్లు కట్టామని కేటీఆర్ గుర్తుచేశారు. ఒక్క ఇల్లు కూలగొట్టకుండా నాగోల్‌లో మూసీని అభివృద్ధి చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్(ఖు=) ఫైర్ అయ్యారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.బంగారు పల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు.

## కాళేశ్వరంపై కమిషన్ ఏర్పాటుకు ఎలాంటి

# దురుద్దేశం లేదు




**హైదరాబాద్, మార్చి 05:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపారు. ఎవరినో టార్గెట్ చేసేందుకు జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు.. అందించిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తమ వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగిందని హైకోర్టుకు ఏజీ వెల్లడించారు.ఇక పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పలువురిపై కమిషన్ తప్పుడు అభియోగాలు నమోదు చేసిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో బిజినెస్ రూల్స్ ఎక్కడా ఉల్లంఘించ లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు పిటిషనర్ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదంటూ న్యాయవాది తన వాదనలు వినిపించారు. తప్పుడు విధానంలో కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ప్రాజెక్ట్ ఖర్చు అంచనాతోపాటు నిర్మాణ సంస్థలకు ఇవ్వడంలో ఎవరు లబ్ధి పొందలేదన్నారు. ఈ కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని.. దీనిపై స్టే ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ న్యాయవాది కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణ మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# ముగిసిన కడియం విచారణ దానం విచారణ వాయిదా



**హైదరాబాద్, మార్చి 05:**
తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ గురువారం సాయంత్రం ముగిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ ఇంకా పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి స్పీకర్ వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాల వారికి స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు.దీంతో ఈ దానం నాగేందర్ పిటిషన్‌ను తెలంగాణ స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

# దుమ్మురేపుతున్న రాఘవ హిమాయత్‌సాగర్ జలాశయ



**రంగారెడ్డి జిల్లా శంషాబాద్** మండలం కొత్వాల్‌గూడ గ్రామ సరిహద్దులో అక్రమ క్రషర్లను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అసైన్డ్ భూముల్లో సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే అక్రమ క్రషర్ల దందా కొనసాగుతుండటంపై సర్వత్రా విమర్శలు తలెత్తుతున్నాయి. సాక్షాత్తు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పేరిట గత కొన్నాళ్లుగా క్రషర్ల దందా నిర్వహిస్తున్నది. వీటికి శాఖాపరంగా ఎలాంటి అనుమతులు లేవని స్థానిక అధికారులు తేల్చిచెబుతున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక ప్రజలు అనేక సార్లు మైనింగ్ శాఖకు ఫిర్యాదులు చేస్తే వాటిలో ఈ సంస్థ పేరును చేర్చకుండానే సంబంధిత శాఖ రెవెన్యూ అధికారులకు పంపింది. మిగతా వాటిపై చర్యలు చేపట్టిన అధికారులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. బహిరంగంగా క్రషర్ల నిర్వహణ చేపడుతూ.. పర్యావరణాన్ని యథేచ్ఛగా వినాశనం చేస్తున్నా..వీటిపై చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం.. అడుగుముందుకేసే పరిస్థితి కనిపించడం లేదు. శంషాబాద్ రూరల్, మార్చి 4 : కొత్వాల్‌గూడ గ్రామ సర్వే నంబరు 62,63లలోని సుమారు పదెకరాల అసైన్డ్ భూములల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అనధికారిక లీజుతో ఎలాంటి అనుమతులు లేకుండా రెండేండ్లుగా క్రషర్లను నడుపుతున్నది. మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండా రెవెన్యూ శాఖ మంత్రి తన అధికార బలంతో నిర్వహిస్తున్నారు. అన్ని పారదర్శకంగా కొనసాగిస్తున్నామంటూ.. ప్రగల్బాలు పలికే మంత్రిగారికి ఈ అనుమతులపై ఎందుకు మౌనంగా ఉన్నారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శంషాబాద్ పట్టణంతో పాటు శంషాబాద్– షాబాద్ రహదారి నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని ఏర్పాటు చేశామంటూ బాహ్య ప్రపంచానికి చెబుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఆ పేరుతో కోట్లాది రూపాయాల విలువైన సహజ వనరులను కొల్లగొడుతున్నది. కాలుష్య నియంత్ర బోర్డుతో పాటు హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అనుమతులు లేకుండానే ఐదెకరాల ఎనిమిది గుంటల అసైన్డ్ భూముల్లో తిష్టవేశారు. క్రషర్ మిషన్‌కు సంబంధించిన రాళ్లను రాజేంద్రనగర్ రెవెన్యూ ప్రాంతంలోని మానస హిల్స్ ప్రాంతంలో నుంచి తీసుకువచ్చి కొత్వాల్‌గూడలో ఏర్పాటు చేసిన క్రషర్లలో రాత్రింబవళ్లు పనులు చేసుకుంటూ ఇక్కడనుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంబంధించి నిర్మాణాలకు తరలిస్తుండటం గమనార్హం. ఇదేమిటనీ ప్రశ్నించే నాథుడే ఇక్కడ లేకపోవడం విశేషం. ప్రశ్నిస్తే అధికార యంత్రాంగం కిమ్మనకుండా ఉండిపోయింది. ఇక్కడ కొండలు, గుట్టలన్నీ పిండిచేసే పొంగులేటి సంస్థ కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటుందనే ఆరోపణలు గుప్పమంటున్నాయి. కమ్మేస్తున్న దుమ్ముకొత్వాల్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన రాఘవ సంస్థ క్రషర్ కంపెనీలతో ఔటర్‌రింగ్ రోడ్డుపై రాత్రి, పగలు తేడా లేకుండా దుమ్ముతో ఈ ప్రాంతాలు కమ్మేస్తున్నాయి. దిగువ ఉన్న హిమాయత్‌సాగర్ జలాశయం పరిసరాల్లో ఉన్న గ్రామాలన్నీ దుమ్ముతో కమ్మేసుకున్నాయి. ఈ ప్రాంతంలో ప్రయాణించే ప్రజలు అనేక అనారోగ్యాల భారిన పడుతున్నారు. స్థానిక ప్రజలు ఎన్ని పర్యాయాలు అధికారులకు ఈ క్రషర్లపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ప్రజలు అంటున్నారు. ఈ క్రషర్లతో ఎవరికి ప్రయోజనమని ప్రశ్నిస్తే వారిపై మంత్రి పొంగులేటి కక్ష సాధింపులు చేస్తున్నారంటూ పలువురు అధికార పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఇంత దయనీయ పరిస్థితిలో శంషాబాద్‌లో మంత్రి పొంగులేటి దందాలు కొనసాగుతున్నాయి. బీఆర్‌ఎస్ పర్యటనకొత్వాల్‌గూడ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న క్రషర్లను పరిశీలించేందుకు రాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ నేతల బృందం గురువారం ఉదయం పదిగంటలకు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థతో పాటు ఇతర క్రషర్లు, రెడీమిక్స్ ప్లాంట్లు ,పలు ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్థానిక నాయకులతో కలిసి పరిశీలించనున్నట్లు తెలిసింది. క్రషర్లకు అనుమతులు లేవుశంషాబాద్ మండల రెవెన్యూ పరిధిలోని కొత్వాల్‌గూడ గ్రామ సర్వే నంబర్లలో కొనసాగుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్వహిస్తున్న క్రషర్లకు ఎలాంటి అమనుతులు లేవని తహసీల్దార్ రవీంద్ర దత్ స్పష్టం చేశారు. స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి సంస్థ/మైనింగ్ సంస్థలు ఇచ్చిన నివేదికలో ఉన్న 20 రెడిమిక్స్ ప్లాట్లను ఇటీవలే తాము సీజ్ చేశామని వెల్లడించారు. ఆ లిస్టులో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ పేరు లేదన్నారు. మిగతా విషయాలు తనకేమీ తెలియదని తహసీల్దార్ వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**చేగుంట మార్చ్ 05 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (పిఆర్ అండ్ ఆర్ డి ) శాఖ ఆధ్వర్యంలో రేపటి నుండి (మార్చి 06) ప్రారంభం కానున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై జిల్లా కలెక్టర్ గురువారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ మార్చి 06 నుండి మార్చి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని, ఇందులో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం, సంస్థాగత నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణ, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై రోజువారీ



కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చేగుంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ ) టి. చిన్నారెడ్డి, తహశీల్దార్ కె. శివ ప్రసాద్, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో ) విజయ్ పాల్, మండల వ్యవసాయ అధికారి ఎం. హరిప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ దివ్య, హౌసింగ్ ఏఈ రియాజ్ ఉద్దీన్ తో పాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులందరూ పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు అందించడమే ఈ 99 రోజుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

# ప్రశ్నే పురోగతికి సోపానం గీతంలో జాతీయ సైన్స్ దినోత్సవంలో సీసీఎంబీ పూర్వ డైరెక్టర్ మోహన్ రావు వ్యాఖ్య

**పటాన్ చెరు మార్చి ;05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ప్రశ్నించే స్ఫూర్తి, ఉత్సుకత శాస్త్రీయ పురోగతికి సోపానాలని బిట్స్ పిలాని–హైదరాబాదు బయోలాజికల్ సైన్సెస్ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ ఎమెరిటస్, హైదరాబాదులోని సెల్యులార్, మాలిక్యులర్ బయాలజీ కేంద్రం (సీసీఎంబీ) పూర్వ డైరెక్టర్ సీహెచ్. మోహన్ రావు అన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కీలకోపన్యాసం చేశారు. సర్ సి.వి. రామన్ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, భారతదేశం అపారమైన జ్ఞానం, ప్రతిభను కలిగి ఉన్నప్పటికీ, వాస్తవ ప్రపంచ సమస్యలకు జ్ఞానాన్ని అనుసంధానించడంలో విఫలమవుతున్నా మని ఆవేదన వెలిబుచ్చారు. పరిశీలన, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణలను విద్యార్థులు పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. దేశం యొక్క శాస్త్రీయ వృద్ధికి అర్థవంతంగా దోహదపడటానికి పరిశోధన అవకాశాలు, ఫెలోషిప్ లు, డాక్టోరల్ అధ్యయనాలను చురుకుగా చేపట్టాలని డాక్టర్ మోహన్ రావు హితవు పలికారు. సైన్స్ లో భారతీయ మహిళలు -- వికసిత్ భారత్ ను ఉత్ప్రేరకపరచడం' అనే స్ఫూర్తిదాయకమైన ఇతివృత్తంతో, దేశ శాస్త్రీయ పురోగతిని రూపొందించడంలో పరివర్తనాత్మక పాత్ర పోషించిన మార్గదర్శక భారతీయ మహిళా శాస్త్రవేత్తల విశేష కృషిని గౌరవించేందుకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మొక్కల సైటోజెనెటిక్స్ లో తన మార్గదర్శక కృషికి పేరుగాంచిన ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞురాలు ఎడవలేత్ కక్కట్ జానకి అమ్మాల్; 19వ శతాబ్దంలో, సామాజిక అడ్డంకులను ఛేదించి మనదేశపు భారతదేశపు మొట్ట మొదటి మహిళా వైద్యురాలిగా నిలిచిన ఆనందిబాయి గోపాల్ రావ్ జోషి; సేంద్రీయ రసాయన శాస్త్రానికి చేసిన అద్భుతమైన కృషికి భారతీయ విశ్వవిద్యాలయం నుంచి సైన్స్ డాక్టరేట్ పొందిన తొలి మహిళ అసిమా ఛటర్జీ; భారతదేశంలో వాతావరణం, వాతావరణ పరిశోధనలను గణనీయంగా అభివృద్ధి చేసిన అన్నామణి వంటి విశిష్ట మహిళా శాస్త్రవేత్తలకు ఈ వేడుకలలో నివాళులర్పించారు. తొలుత, ప్రొఫెసర్ మోహన్ రావు గీతంలోని ప్రతిష్టాత్మక మూర్తి ల్యాబ్ (అనువాద చొరవలపై బహుళ విభాగ పరిశోధనా విభాగం)ను సందర్శించారు. సహకార పరిశోధన ద్వారా ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించే క్రాస్– డిసిప్లినరీ థింక్ ట్యాంక్ గా పనిచేయడం దీని లక్ష్యం. ఈ సందర్శనలో భాగంగా, డాక్టర్ మోహన్ రావు బయోటెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్ లాబొరేటరీని కూడా ప్రారంభించారు. ఆ తరువాత లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల అధ్యాపకులతో ముఖా ముఖి చర్చించారు. ఈ కార్యక్రమంలో గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, గీతం విశిష్ట ఆచార్యులు డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ బి.వి.ఆర్.టాటా, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సెయింట్ ఆన్స్, సెయింట్ జోసెఫ్, స్ఫూర్తి, ప్రగతి డిగ్రీ కళాశాలల నుంచి






500 మంది డిగ్రీ విద్యార్థులు ఈ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతదేశపు మార్గదర్శక మహిళా శాస్త్రవేత్తల వారసత్వాన్ని ప్రతిబింబించడానికి, అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం యొక్క దార్శనికతకు దోహదపడటానికి, వారి నిబద్ధతను పురుద్ఘాటించడానికి ఈ వేడుకలు విద్యార్థులకు ఒక శక్తివంతమైన వేదికను అందించాయి. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

# ఇల్లు కూల్చుకుని నా పిల్ల పెండ్లి ఎట్ల చెయ్యాలె.. మూసీ బాధితురాలి ఆవేదన



**నాగోల్ :** గత కేసీఆర్ ప్రభుత్వంలో మూసీ సుందరీకరణలో భాగంగా నిర్మించిన నాగోల్ ఝాని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుదీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ వాణి దేవి ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బాధితులతో మాట్లాడారు. ఓ అవ్వ తన ఆవేదనను వ్యక్తం చేసింది. నేను కూడా మూసీ బాధితురాలినే.. మొదటిసారి హైడ్రా వచ్చినప్పుడు నా కోడలు నిండు గర్భిణీ. అయినా బయట నిలబెట్టి.. నాకు గుండె దడ ఉండేది. నేను ఇళ్లల్ల పనిచేసుకునేదాన్ని. మా ఆయన 30 ఏళ్ల కిందట చచ్చిపోయిండు. నాకు పెళ్లి కావాల్సిన పిల్ల ఉంది. ఇప్పుడు ఇల్లు కూలుస్తానంటే నేను ఎలా ఓర్చుకునేది. మేము చాలా బాధలు పడి ఇల్లు కట్టినం. మా పెద్ద మనవడు పుట్టినపుడు కేసీఆర్ కిట్ వచ్చింది. రేవంత్ వచ్చినంక ఏ కిట్ రాలేదు. ఈ సార్ (కేటీఆర్) వచ్చి మేమున్నం అమ్మ అంటూ ధైర్యమిచ్చిండు. రేవంత్ రెడ్డి వచ్చినంక కష్టాలు పెట్టిండు. సంవత్సరం నుంచి నేను తిండి తిప్పలు మానేసి నాకు ఎదిగిన 18 ఏళ్ల పిల్ల ఉంది. ఇల్లు కూల్చుకొని పెండ్లి ఎట్ల చేయాలి. నాకు ఇద్దరు కొడుకులు. నా చిన్నకొడుకు ఆరోగ్యం కూడా బాగుండదు. నేను చచ్చిపోయినా చచ్చిపోతా.. నా ఇల్లు కూలగొట్టొద్దు అని ఎడ్చిన. అప్పుడు నా కొడుకు వచ్చి పెట్రోలు కూడా పోసుకుండు. ఒట్లేసి గెలిపిస్తే ఆ రేవంత్ రెడ్డి వచ్చి ఏం చేస్తుండు. ఆఈ సార్ (కేటీఆర్) వచ్చి మేమున్నం అమ్మ అంటూ ధైర్యమిచ్చిండు. రేవంత్ రెడ్డి వచ్చినంక కష్టాలు పెట్టిండు. సంవత్సరం నుంచి నేను తిండి తిప్పలు మానేసి నాకు ఎదిగిన 18 ఏళ్ల పిల్ల ఉంది. ఇల్లు కూల్చుకొని పెండ్లి ఎట్ల చేయాలి. నాకు ఇద్దరు కొడుకులు. నా చిన్నకొడుకు ఆరోగ్యం కూడా బాగుండదు. యన ఏం చేయలే. కేసీఆర్ ఉండంగ రూ.2 వేల పెన్షన్ ఇచ్చిండు. ఇయ్యాళ ఆ రెండువేలే ఇస్తుండు.. ఆయన మూసీని మంచిగ చేసుకుంటే చేసుకోమను. మా ఇండ్ల నుంచి పోనివ్వం.. అంటూ ధ్వజమెత్తింది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని.. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు.

# అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామి మరింత పెరగాలి

**- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**- జిన్నారంలో న్యూ లాండ్ పరిశ్రమ సహకారంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం ప్రారంభం**






**జిన్నారం మార్చి :05(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో న్యూ లాండ్ పరిశ్రమ సౌజన్యంతో 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక వసతులతో భవనాలు నిర్మించి విద్యార్థులకు కార్పోరేట్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సైతం ఉన్నత లక్ష్యంతో చదివి. పుట్టిన ఊరికి కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, పరిశ్రమ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు



# వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేస్తాం.. రైతన్నల జీవితాలు మారుస్తాం



**అమరావతి, మార్చి 5:** వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి నేటికి 30 ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. కీలక ప్రకటన చేశారు. 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన రోజును గుర్తుచేస్తూ.. ఇప్పుడు పనులను పూర్తి చేసి నీటిని అందించే అవకాశం తనకే వచ్చిందని సీఎం పేర్కొన్నారు. 1996 మార్చి 5.... ఆ రోజు తనకు ఇంకా గుర్తుందన్నారు సీఎం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన పశ్చిమ ప్రాంతాల్లో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతుంటే.. వారి కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం తొలి అడుగు వేశామని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో.. జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని వినియోగించుకునే ఆలోచనతో 30 ఏళ్ల క్రితం ఇదే రోజున (1996 మార్చి 5న) ముఖ్యమంత్రిగా తాను వెలిగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. అనేక కారణాలతో తరువాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలైన వెలిగొండ పనులను మళ్లీ 2014-19 మధ్య వేగవంతం చేశామన్నారు సీఎం. ప్రాజెక్ట్ కోసం రూ.1,414 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. అయితే తరువాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం పేరుతో ప్రజలను మోసం చేసి నవ్వులపాలు అయ్యిందని సీఎం అన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# అంగన్‌వాడీ సమస్యలపై అసెంబ్లీలో చర్చ



**అమరావతి, మార్చి 5 :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 14వ రోజు సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం శాసన సభలో అంగన్‌వాడీల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా పాక్షికంగా పూర్తయిన అంగన్‌వాడీ భవనాల అంశంపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఈ విషయంపై తెలుగు దేశం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. అంగన్‌వాడీల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని తాము వెళ్లినప్పుడు ఆయా కేంద్రాల్లో ఐదుగురు మాత్రమే ఉంటున్నారని చెప్పుకొచ్చారు. ఇది భారీ కార్యక్రమమని.. చాలా మందికి ఉపాధి కల్పించిందని తెలిపారు. కడియం మండలంలో స్థానిక సంస్థల నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేశారని గోర ఓంట్ల బుచ్చయ్య ప్రస్తావించారు. వారికి గ్రాట్యూటీ ఇస్తాం: మంత్రి సంధ్యారాణిఅలాగే ఇదే అంశంపై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా 55,746 అంగన్‌వాడీ కేంద్రాల్లో 21,756 సొంత భవనాలు, 10,556 కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయని వివరించారు. 23,424 కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయని... వాటిని అమలు చేస్తున్నామని, వాటిలో కొన్ని భవనాలు నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. 2922 భవనాల నిర్మాణాలను అమలు చేశామని.. వీటిలో 948 అంగన్‌వాడీ భవనాలు పూర్తి దశలో ఉన్నాయని.. వాటికోసం రూ.4కోట్లు విడుదల అయ్యాయని చెప్పుకొచ్చారు. రూ.193 కోట్లు ఉంటే అన్ని అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయగలుగుతామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 62 సంవత్సరాలు పూర్తయితే వారికి గ్రాట్యూటీ ఇస్తామని స్పష్టం చేశారు. రాగి, జొన్నలను కూడా ఆహారంగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు అంగన్‌వాడీలకు ఫేషన్ రికగ్నిజైషన్ ఉండటంతో అందరూ సెంటర్లకు వస్తున్నారని పేర్కొన్నారు. ఆ బాధ్యత టీచర్లకు, ఆయాలకు అప్పగిస్తున్నాం..'ముస్తాబు' కార్యక్రమంతో అంగన్‌వాడీల్లోని పిల్లలు కూడా చక్కగా చదువుకొంటున్నారని మంత్రి సంధ్యారాణి వివరించారు. 547 కేంద్రాలు రిపేర్లలో ఉన్నాయని, 9240 కేంద్రాల్లో టాయిలెట్స్, 11,400 కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించామని అన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లలు బరువు పెరుగుతున్నారో లేదో చూసుకొనే బాధ్యత కూడా టీచర్లకు, ఆయాలకు అప్పగిస్తున్నామని వెల్లడించారు. అంగన్‌వాడీల్లోని పిల్లల హాజరు.. గతంలో 70శాతం ఉంటే.. ఇప్పడు 93శాతం ఉందన్నారు. దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఏపీ ఉందని చెప్పుకొచ్చారు. 20వేల కేంద్రాలకు ఇండక్షన్ స్టౌలు ఇచ్చామని తెలిపారు. ఇండోర్ గేమ్స్, చార్ట్‌లు, పిల్లలకు ఈ ఏడాది అందించామని వెల్లడించారుఅంగన్‌వాడీలకు జీతాలు పెంచాం..అంగన్‌వాడీలకు గతంలో రూ.4200 జీతం ఉండేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.11,500 జీతం పెంచామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. తమ ప్రభుత్వం అంగన్‌వాడీలకు మూడు సార్లు జీతం పెంచిందని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీలు పది డిమాండ్లు అడిగితే వాటిలో 9 పూర్తి చేశామని తెలిపారు. రూ.75 కోట్లతో 5జీ ఫోన్లను అంగన్ వాడీలకు ఇచ్చామని వివరించారు. జనాభా ప్రాతిపదికన కొత్త అంగన్‌వాడీలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అంగన్‌వాడీల అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి సంధ్యారాణి మాటిచ్చారు.కాగా, శాసనమండలిలో వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత టీటీడీ ఛైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ వైసీపీ సభ్యులు , కల్యాణి, భరత్ వాయిదా తీర్మానం ఇచ్చారు.

# టిడ్కో ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రకటన




**అమరావతి, మార్చి 5:** ఏపీలోని నగరాలు, పట్టణాల్లో జనాభా ప్రస్తుతం 36 శాతం ఉండగా, 2047 నాటికి 60 శాతానికి చేరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. దీనికి తగినట్లుగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. గురువారం ఏపీ శాసనసభలో పురపాలకశాఖ బడ్జెట్ రూ.14,538కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెత్త సేకరణ, నిర్వహణ, నీటి పునర్వినియోగం, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, రోడ్లు, ఆసుపత్రులు, శ్మశానాలు వంటి అంశాలపై దృష్టి సారించామని మంత్రి వివరించారు.ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో 2100 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్ యార్డుల్లోని చెత్తను పూర్తిగా క్లియర్ చేస్తున్నామని.. జూన్ నాటికి అన్ని డంపింగ్ యార్డులు శుభ్రంగా తయారవుతాయని వెల్లడించారు. గతంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని 2.65 లక్షలకు కుదించి, రంగులు మార్చిందన్నారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు చేసిందని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రూ.4,451 కోట్లు హడ్కో రుణం మంజూరైందని.. ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు.పరిశుభ్రమైన వాతావరణంలో 205 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 3.07 కోట్ల మంది అల్పాహారం, 3.64 కోట్ల మంది భోజనం, 1.59 కోట్ల మంది రాత్రి భోజనం తీసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో 75 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేశామన్నారు. వివిధ శాఖల ఎన్‌ఓసీలను సింగిల్ విండో విధానంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని.. తణుకులో రూ. 691 కోట్లు, తిరుపతిలో రూ.147 కోట్లు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ తర్వాత సమస్య పరిష్కారమవుతుందని మంత్రి తెలిపారు. రాజధాని అమరావతిని వైసీపీ మూడుముక్కలాటతో నాశనం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ల పాత బిల్లులు క్లియర్ చేశామని, మళ్లీ కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించామని తెలిపారు. వర్షాలు ముగిసిన తర్వాత పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు ఈ నెలలో పూర్తవుతాయని అన్నారు. మిగతా అధికారుల భవనాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు.మున్సిపాలిటీలకు పన్నుల రూపంలో వచ్చిన రూ. 3,500 కోట్లను వైసీపీ దారి మళ్లించిందని మంత్రి ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పన్ను డబ్బులను సంబంధిత మున్సిపాలిటీల్లోనే ఖర్చు చేసుకునేందుకు అనుమతించామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. ఆపై మున్సిపల్ బడ్జెట్ గ్రాంట్లను శాసనసభ ఆమోదించి

# చైర్మన్ పోడియం వద్ద వైసీపీ నిరసన.. తీవ్ర గందరగోళం




**అమరావతి, మార్చి 5:** ఏపీ శాసనమండలిలో మరోసారి గందరగోళం నెలకొంది. తిరుమల నెయ్యి కల్తీ అంశంపై లఘు చర్చ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ అంశంపై వివరణ ఇస్తుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. మంత్రి వివరణ సమయంలోనే మతాల ప్రస్తావన చేసిన అచ్చెన్నాయుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియం పైకి ఎక్కి నిరసన చేయడంతో సభను కొద్ది సేపు వాయిదా వేశారు ఛైర్మన్.నిన్న ఛైర్మన్‌పై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టు లపై వైసీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యుడు అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. అప్పిరెడ్డి డిమాండ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ ఆదేశా లు ఇచ్చారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఛైర్మన్‌ను ఉద్దేశించి నిన్న చేసిన వ్యాఖ్యలపై వెంటనే వివరణ ఇచ్చానని మంత్రి చెప్పారు. 'పోస్టులు పెట్టేది వాళ్లే, ప్రస్తావించేది వాళ్లే' అని వైసీపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.అయితే, నిన్న వైసీపీ అధినేత జగన్ క్రిస్టియన్ అని తాను చేసిన వ్యాఖ్యలపై ఇంతవరకు సమాధానం లేదని, ఆ వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. నిరసన మధ్యనే లడ్డూ అంశంపై స్టేట్‌మెంట్ ఇవ్వడం ప్రారంభించారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. అయినప్పటికీ వైసీపీ నిరసనలు కొనసాగడంతో ఛైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# హోం మంత్రి అనితకు అస్వస్థత



**అమరావతి, మార్చి 05:** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆమె కొంత అస్వస్థతకు గురయ్యారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న వైద్యులు. అనితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు బీపీ అధికంగా ఉందని గుర్తించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడలోని ఆసుపత్రికి మంత్రి అనిత వెళ్లారు.

# అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా



**అమరావతి, మార్చి 5:** అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారని... అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని అన్నారు. వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని స్పీకర్ గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలన్నారు.అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్‌లో సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా సక్సెస్ అవుతుందని స్పీకర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే.. అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని స్పీకర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డికి దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు.జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యేలతో సరదాగా ఉండేవారని గుర్తు చేశారు స్పీకర్. విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో ప్రారంభోత్సవానికి సీఎంగా వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే అయిన తనను స్టేజ్‌పైకి ఆహ్వానించి, ప్రోటోకాల్ పాటించలేదని కలెక్టర్‌ను అక్కడే మందలించారని ఆనాటి అనుభవాన్ని స్పీకర్ మీడియాతో పంచుకున్నారు. అప్పట్లో అధికార-ప్రతిపక్ష సభ్యులు సభలో ప్రజా సమస్యలపై పోరాడినా బయట స్నేహంగా ఉండేవారని గుర్తు చేశారు. రాను రాను ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారని స్పీకర్ అన్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా.. పెద్ద ఆలోచనలు ఉన్నవారితో నిండి ఉండేదని.. ఇప్పుడు పెద్ద ఆలోచనలు లేని వారు ఉండటం వల్ల ఎలా ఉంటుందో చూస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

# ఏపీ శాసన మండలి వాయిదా




**అమరావతి, మార్చి 05:** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం మండలి ప్రారంభమైన తర్వాత.. తిరుమల శ్రీవారి కల్తీ నెయ్యిపై లఘు చర్చ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి వివరణ ఇస్తుండగా.. ఆయన ప్రసంగానికి వైసీపీ సభ్యులు అడ్డు తగిలారు. బుధవారం శాసన మండలి ఛైర్మన్ మోజేస్ రాజుపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టుల పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలంటూ వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు ఛైర్మన్ స్పందిస్తూ.. చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.మండలిలోనేఉన్న మంత్రి అచ్చెన్నాయుడు అందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఛైర్మన్ గురించి బుధవారం చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చానని మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. అసలు తాను ఈ వ్యాఖ్యలు చేసింది వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ గురించి అని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. కానీ దీనిపై ఇప్పటి వరకు సమాధానం లేదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. తాను చేసిన ఈ వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.దీంతో మండలిలో వైసీపీ సభ్యులు మరింత రెచ్చిపోయారు. మండలిని కొద్దిసేపు వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ మండలి ప్రారంభమైంది. అయినా పరిస్థితి పూర్తిగా అదుపులోకి రాలేదు. అలాంటి వేళ.. మండలిని శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ మోజేస్ రాజు ప్రకటించారు.

# లేట్ నైట్ రివ్యూలు తగ్గించండి మంత్రికి ఎమ్మెల్యే సూచన



**అమరావతి, మార్చి 5:** మంత్రి నారాయణ రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం పర్యటిస్తూ కష్టపడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..రోజుకు పలు మున్సిపాలిటీల్లో రివ్యూలు నిర్వహిస్తూ రాత్రి 11 గంటల వరకు మంత్రి పని చేస్తున్నారని, ఆరోగ్య దృష్ట్యా రాత్రి లేట్ రివ్యూలు తగ్గించాలని సూచించారు. మున్సిపల్ శాఖకు రూ.14,538 కోట్ల బడ్జెట్ కేటాయించడం అభినందనీయమని ఆయన అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన పీఎమ్ఏవై అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ.. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 7.1 లక్షల ఇళ్లు మంజూరు చేశారని, 2014--2019 మధ్య సుమారు 5 లక్షల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం 2.39 లక్షల టిడ్కో ఇళ్లను రద్దు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇళ్ల కోసం డబ్బులు కట్టిన 2.39 లక్షల మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విశాఖ నార్త్ నియోజకవర్గంలో ట్రై జంక్షన్‌లో 1296 ఇళ్లు, చీమలపల్లి 1 ఽ 2లో 288 ఇళ్లు మొత్తం 1596 ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.లబ్ధిదారులు రూ.3.65 లక్షల బ్యాంకు లోన్ తీసుకుని ఈఎమ్ఐలు చెల్లిస్తున్నా ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. వెంటనే టెండర్లు పిలిచి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వీఎమ్ ఆర్‌డీఏ() మాస్టర్ ప్లాన్ 2041లో అనకాపల్లి -- రాజకాలవ రోడ్డును 100 మీటర్ల వెడల్పుగా నిర్ణయించడంపై అభ్యంతరం తెలిపారు. ప్రస్తుతం రోడ్డుకు 60 మీటర్లు సరిపోతుందని, అదనంగా 40 మీటర్లు అవసరం లేదని చెప్పారు. రోడ్డు విస్తరణ కోసం 700 ఎకరాల భూసేకరణ అవసరమవుతుందని, రైతులకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు.ఎన్ఏఎల్ఏ() కన్వర్షన్ చార్జీల మార్పులు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. మున్సిపల్ పనుల్లో రూ.3000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుత ప్రభుత్వం రూ.1300 కోట్లు క్లియర్ చేసినందుకు మంత్రికి అభినందనలు తెలిపారు. చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు కూడా త్వరగా చెల్లించాలని కోరారు. పాత జీవో 35 అమలు చేయాలని, జీవో 62 సరైనది కాదని అభిప్రాయపడ్డారు. పూర్తి అయిన భవనాల పనులకు పేమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కోరారు.

# ఆ రెండు బిల్లులకు ఏపీ శాసనమండలి ఆమోదం.



**అమరావతి, మార్చి 5 :** ఏపీ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల సవరణ బిల్లు-2026ని శాసన మండలి ఆమోదించింది. అగ్నిమాపక వ్యవస్థను ఆధునికీకరణ చేసి మరింత బలోపేతం చేయడం కోసం చట్ట సవరణ చేసింది. అగ్నిమాపక వ్యవస్థలో పలు సంస్కరణలు అమలు చేస్తూ చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపింది.అగ్నిప్రమాదాల విషయంలో నిర్లక్ష్యం వహించిన యజమానులపై కఠిన జరిమానా విధిస్తామని శాసన మండలి హెచ్చరించింది. ఈ బిల్లులో లోపాలను సవరిస్తూ చట్ట సవరణ చేసింది. ఆంధ్రప్రదేశ్ జన విశ్వాస్ సవరణ బిల్లు 2006-కు శాసన మండలి ఆమోదం తెలిపింది. మారుతున్న కాలానికి అనుగుణంగా సవరణలు చేస్తూ చట్టసవరణకు ఆమోదించింది. వాడుకలో ఉన్న కొన్ని చట్టాలు రద్దు చేసి కొత్త చట్టంలో సవరణలు చేస్తూ శాసన మండలి ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

మెదక్ టుడే
MEDAK TODAY
శుక్రవారం, 06 మార్చి 2026

# రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మనుసింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు




హైదరాబాద్ :రాష్ట్రం నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ వ్యవ హారాల మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామపత్రాలు అందించారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు స్థానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డికి అవకాశం కల్పించింది.16 మంది ప్రయ త్నం : రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల భర్తీ కోసం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ కసరత్తు చేసింది. భారీ సంఖ్య లో ఆశావహులు రంగంలోకి దిగడంతో వారి వివరాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏఐ సీసీకి నివేదించారు. ఆశావహుల రాజకీయ ప్రస్థానం, పార్టీ పట్ల విధేయత చేసిన సేవలు, సామాజిక సమీకరణ తదితర అం శాలను అధిష్ఠానానికి ఇచ్చిన నివేదికలో పొందుపరచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 16 మంది వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు రాజ్యసభ స్థానాల కోసం ప్రయత్ని ంచారు. రెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సీనియర్ నేతలు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రి చిన్నారెడ్డి వంటి నేతలు నేరుగా అధిష్ఠానాన్ని కలిసి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే చివరికి అధిష్ఠానం నిర్ణయంలో రెండు ప్రధాన ప్రమాణాలు ప్రాధాన్యతలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లినట్లు సమాచారం.తెలంగాణ రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేంద్రరెడ్డిదాదాపు అరగంటపాటు చర్చలు : జాతీ య స్థాయిలో పార్లమెంటులో బలమైన వాదనలు వినిపించే నేత అవసరమని భావించిన అధిష్ఠానం ఏఐసీసీ కోటా కింద అభిషేక్ మను సింఘ్వీని తిరిగి రాజ్యసభకు పంపాలని నిర్ణయించింది. న్యాయవాది, రాజ్యాంగ నిపుణుడిగా ఆయనకు ఉన్న అనుభవం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక రెండో స్థానాన్ని రాష్ట్ర నాయకత్వానికి వదిలేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయాన్ని తెలుసుకుని తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల రెండో తేదీన వికారాబాద్ పర్యటనకు వచ్చిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్?లతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దాదాపు అరగంటపాటు చర్చలు జరిపారు. అప్పుడే అభ్యర్థుల ఆ చర్చల్లో వేం నరేంద్ర రెడ్డి పేరు బలంగా వినిపించింది. తరువాత నిన్న మరోసారి ఫోన్ ద్వారా రాష్ట్ర ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కేసీ వేణుగోపాల్ అభిప్రాయాలు సేకరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వేం నరేంద్ర రెడ్డి అభ్యర్థిత్వంపై ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టత వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకున్నారు.ఆయన పాత్ర వెలకట్టలేనిదని : సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వేం నరేంద్ర రెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర రాజకీయాల్లో కీలక స్థానాన్ని సంపాదించుకున్నారు. పార్లమెంటు ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నిక జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సమయంలో తెర వెనుక వ్యూహరచనలో ఆయన పాత్ర వెలకట్టలేనిదని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. అంతేకాదు ప్రభుత్వం, పార్టీ మధ్య అనుసంధాన కర్తగా కూడా కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వివాదాస్పద అంశాల్లో సైతం జోక్యం చేసుకుని సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లగల నాయకుడిగా ఆయనకు ఉన్న ఇమేజ్ కూడా అధిష్ఠానం దృష్టిలో ఉన్నట్లు సమాచారం. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని జాతీయ స్థాయిలో సింఘ్వీ, రాష్ట్ర స్థాయిలో వేం నరేంద్ర రెడ్డిని ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి.

## నా భార్య గర్భిణి సార్ అని వేడుకున్నా మెడలు పట్టుకొని బయటకు వెళ్లగొట్టారు : మూసీ బాధితుడు



హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న పనులతో గత రెండు సంవత్సరాల నుంచి మాకు నిద్రపట్టడం లేదంటూ మూసీ బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. గత కేసీఆర్ ప్రభుత్వంలో మూసీ సుందరీకరణలో భాగంగా నిర్మించిన నాగోల్ ఝాని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ వాణి దేవి ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సదరు మూసీ బాధితుడు మాట్లాడుతూ.. నాకు తెలిసినప్పుడు నా భార్య 9 నెలల గర్భిణీ. అప్పటి నుంచి నాకు సరిగా నిద్రపట్టడం లేదు. అప్పుడు కూడా నా భార్య ప్రెగ్నెంట్. ఇప్పుడు కాదు.. మా ఇల్లు మేం కష్టపడి కట్టుకున్నం అంటే లేదు.. మీరిక్కడ ఉంటరా.. బయటకు వెళ్లిపోతరా.. మీ ఇల్లు కూల్చేస్తమన్నారు. ప్రెగ్నెంట్ అని చెప్పిన కూడా మమ్మల్ని రూమ్‌ల్లో పెట్టి తాళం వేసి బయటకు రాకుండా చేసి.. మీరు లోపే ఉండండి.. లేదంటే మూసీ పేరు మీద మీ ఇల్లు కూలగొట్టేస్తమని అన్నరు. అప్పుడు సుధీర్ అన్న మా దగ్గరకు వచ్చి మాకు భరోసా ఇచ్చిండు. మమ్మల్ని ఆదుకుంటా అని చెప్పిండు అంటూ కన్నీరు పెట్టుకున్నాడు.నా భార్య గర్భిణి సార్ అని వేడుకున్నా కూడా ఇల్లు కూల్చేస్తామని అన్నారు. అధికారులు నన్ను మెడలు పట్టుకొని బయటకు వెళ్లగొట్టారు. సొంత ఇల్లును కూల్చేస్తామని అంటే గర్భిణీ అయిన నా భార్యను కిరాయి ఇంట్లో పెట్టిన. అన్ని అనుమతులు ఉన్నా కూడా నా ఇంటిని కూల్చేస్తామని అన్నారు. అందుకే పెట్రోల్ పోసుకున్నానంటూ కేటీఆర్ దగ్గర మూసీ బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.

# హైదరాబాద్‌లో భారీగా కల్తీ నెయ్యి పట్టివేత నిందితుడు అరెస్టు



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో కల్తీనెయ్యి కలకలం రేపింది. కల్తీ నెయ్యి విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సమాచారం. మొత్తం 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో నిందితుడు జునైద్ హుస్సేన్‌ను అరెస్టు చేశారు.నెయ్యిలా వాసన వచ్చేందుకు : నగరంలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్న స్థావరంలో బుధవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. పామాయిల్, మీగడ, ప్రమాదకరమైన రసాయనాలతో తయారు చేసిన 460 కిలోల నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు జునైద్ హుస్సేన్ (26)ను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ భోలానగర్‌కు చెందిన జునైద్ ఫ్రైడ్ డెయిరీ పేరుతో అనుమతి తీసుకొని ఇంటినే అడ్డాగా మార్చుకున్నజునైద్ హుస్సేన్, గేదె, ఆవు, పాల నుంచి మీగడ సేకరించి దానిలో పామాయిల్, వనస్పతిలను, ఇతర రసాయనాలతో దీనిని తయారు చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. నెయ్యిలా వాసన వచ్చేందుకు రసాయనాలను ఉపయోగించేవాడు. వీటిని ప్యాకెట్లుగా మార్చి నాణ్యమైన నెయ్యిగా చెబుతూ తక్కువ ధరకు శుభకార్యాలకు, హోటళ్లకు భారీ ఎత్తున విక్రయించేవాడు.కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్ : కొద్దినెలలుగా సాగుతున్న ఈ కల్తీపై టాస్క్‌ఫోర్స్ డీసీపీ అందె శ్రీనివాసరావుకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు విజయానంద్, చందన, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రూ.18.26 లక్షల విలువైన 460 కిలోల కల్తీ నెయ్యి, 70 కేజీల కల్తీ మిశ్రమం, సుమారు 3,260 కేజీల మీగడ, 28 డబ్బాల వనస్పతిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కల్తీ నెయ్యి, తయారీ యంత్రాలు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఇంట్లో వాడే నెయ్యి నాణ్యమైనదో లేదో కొన్ని పద్ధతుల ద్వారా తెలుసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నెయ్యి స్వచ్ఛతను నిర్ధారించేందుకు స్టవ్?పై ఉంచి వేడిచేస్తే సువాసన వచ్చినట్లయితే అది నాణ్యమైన నెయ్యి అని అర్థం. స్వచ్ఛమైన నెయ్యి వేడి చేస్తే అంతగా పొగరాదు. కల్తీది అయితే మాత్రం పొగ ఎక్కువగా వస్తుంది. కాలిన వాసన వస్తుంది. ఇలా వచ్చిందంటే ఆ నెయ్యిలో ఏదైనా పదార్థాలు కలిపినట్లుగా అర్థం చేసుకోవాలి.నెయ్యి స్వచ్ఛతను పరీక్షించేందుకు ఓ గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకోవాలి. అందులో కొంత నెయ్యి వేసి బాగా కలపాలి. నాణ్యమైన నెయ్యి అయితే ఆ ద్రావణంలో పూర్తిగా కరిగిపోతుంది. కల్తీ నెయ్యి అయితే మాత్రం నీటిపై తేలిపోయి విడిపోయినట్లుగా ఉంటుంది. మలినాలు కనిపిస్తాయి.పైన వివరించిన రెండు పద్ధతులే కాకుండా మరికొన్ని విధాలుగా కూడా నెయ్యి నాణ్యతను పరీక్షించవచ్చు. ఇందుకోసం తెల్లటి గుడ్డపై కొద్ది పరిమాణంలో నెయ్యిను వేయండి. కొన్ని సమయం పాటు అలా ఉంచండి. నాణ్యమైన నెయ్యి అయితే అది ఎండిపోయిన తర్వాత మరకలు లాంటివి ఏవీ కనిపించవు. ఒక వేళ గుడ్డపై ఏవైనా అవశేషాలు, మరకలు లాంటివి కనిపించినా అది కల్తీ అయ్యిందని తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# ఒకట్రెండు రోజుల్లో లొంగిపోనున్న మావోయిస్టులు జాబితాలో 100 మందికిపైగా




కరీంనగర్ జిల్లా :సాయుధ మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఒకట్రెండు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు లొంగిపోనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇది అతి పెద్ద లొంగుబాటు కానుందని సమాచారం. 100 మందికి పైగా మావోయిస్టులు జనజీవనస్రవంతిలో కలవనుండగా వారిలో పీఎల్?జీఏ కేడర్‌తో పాటు అగ్రనేతల అంగరక్షకులు కూడా ఉన్నట్లు తెలుసో_ంది.దాదాపు వంద మందికి పైగా సాయుధులు పోలీసులు సమక్షంలో జనజీవన స్రవంతిలో కలవడంతో పాటు 60కి పైగా ఆయుధాలను అప్ప గించనున్నట్లు సమాచారం. 2002లో ఉమ్మడి రాష్ట్రంలో జనశక్తి కరీంనగర్ జిల్లా కార్యదర్శి రణధీర్ నేతృత్వంలో 46 మంది నక్సలైట్లు లొంగిపోవడమే ఇప్పటివరకు ఉన్న రికార్డు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదుల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయినా వారంతా మిలిటెంట్లు, సానుభూతిపరులు మాత్రమే ప్రస్తుతం లొంగిపోనున్నది. మావోయిస్టు పార్టీలో కీలకమైన మిలిటరీ శిక్షణ పొందిన పీఎల్?జీఏ కేడరే కావడంతో ప్రాధాన్యం సంతరించుకొంది.ఇటీవలే మావోయిస్టు సెంట్రల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్, నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నల లొంగుబాటు ద్వారా మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో పట్టు నిరూపించుకున్న తెలంగాణ పోలీసులు తాజాగా జరగనున్న లొంగుబాటుతో తమదైన ముద్రను సొంతం చేసుకోనున్నారు. లొంగిపోనున్న సాయుధ మావోయిస్టుల్లో పై నలుగురు అగ్రనేతలకు అంగరక్షకులుగా వ్యవహరించిన సాయుధులతో పాటు కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కేడర్ ఉన్నారు. తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ సౌత్‌బస్తర్ కమిటీలకు నేతృత్వం వహించిన వారూ ఉన్నారు. వీరిలో సింహభాగం చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారే ఉన్నారు.ఆపరేషన్ కగార్ ఉద్ధృతమైన నేపథ్యంలో 2024 ఆగస్టులో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు గణపతి, బస్వరాజ్, దేవీ సహా అందుబాటులో ఉన్న కేంద్రకమిటీ సభ్యులు సమావేశమై కీలక తీర్మానం చేసుకున్నారు. చత్తీస్‌గఢ్ అడవుల్లో ఉన్న మావోయిస్టు కేడర్ అర్బన్ షెల్టర్లకు వెళ్లి తలదాచుకోవాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విధించిన 2026 మార్చి 31 డెడ్లైన్ గడువు ముగిసిన తర్వాత దండకారణ్యానికి తిరిగి వచ్చి తదుపరి కార్యాచరణపై సమీక్షించుకోవాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి తలదాచుకున్నారు. అనంతర పరిణామాల్లో అక్కడి పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.మరోవైపు తెలంగాణాలోని ములుగు, ఆసిఫాబాద్ అడవుల్లోనూ పలువురు మావోయిస్టులు రోజుల తరబడి మకాం వేశారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం ఆసిఫాబాద్ అడవుల్లో 20మందికి పైగా మావోయిస్టుల కదలికలు గుర్తించిన నిఘావర్గాలు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. గ్రేహౌండ్స్ దళాలతో కలిసి కూంబింగ్ చేసిన క్రమంలో.. మావోయిస్టుల ఆచూకీ లభించడంతో గంటల పాటు సంప్రదింపులు జరిపిన అనంతరం వారిని లొంగిపోయేలా చేశారు. తాజాగా వారి లొంగుబాటు చూపించనున్నట్లు తెలిసింది. 591 మంది మావోయిస్టులు : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు.

# పంచాయతీల్లో కొత్త సర్పంచ్ పాత సర్పంచ్ పెండింగ్ బిల్లులపై లొల్లి రంగంలోకి మంత్రి సీతక్క





హైదరాబాద్ :తెలంగాణలో దాదాపు 2 ఏళ్ల ఆలస్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. జనవరి నెలలోనే గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడి.. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లతో పా లన సాగుతోంది. తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం చేయడంతో.. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచింది. ఎన్ని కలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వాటిని రిలీజ్ చేస్తామని తేల్చి చెప్పింది. దీంతో ఇటీవల ఎన్నికలు పూర్తై గ్రామాల్లో కొత్త సర్పంచ్‌లు వచ్చిన తర్వాత.. దశల వారీగా 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేస్తోంది. అదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇక్కడే ఇప్పుడు అసలు సమస్య మొదలైంది.పలు విడతల్లో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 1,034 కోట్ల నిధులను ఇటీవలె విడుదల చేసింది. ఇప్పుడు ఈ నిధుల గురిం చే.. కొత్త సర్పంచ్‌లు, పాత సర్పంచ్‌లకు మధ్య తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తాము గతంలో సర్పంచ్ హోదాలో గ్రామాల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు కల్పించామని.. వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు పాత సర్పంచులు చెబుతున్నారు. ఆ పనులకు అప్పట్లో బిల్లులు రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుపోతున్నాయని పాత సర్పంచ్‌లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.1,000 కోట్లకు పైగా పాత బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన నిధులపై తమకే హక్కు ఉంటుందని తేల్చి చెబుతున్నారు. ఇక.. కొత్త సర్పంచ్‌లు మాత్రం వాటికి ససేమిరా అనడంతో అసలు వివాదం మొదలైంది. తాము పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి, గ్రామాలను డెవలప్ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చామని.. ఇప్పటివరకు వచ్చిన నిధులు మొత్తాన్ని పాత బకాయిలకే చెల్లిస్తే.. ఇక గ్రామాల్లో అభివృద్ధి ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు.తాము అధికారంలోకి వచ్చీ రాగానే.. కేంద్రం నుంచి విడుదలైన నిధులను ఇవ్వకపోతే.. ఇక గ్రామ పంచాయతీలను ఎలా నడపాలంటూ ప్రశ్నిస్తున్నారు. చకుండా కేవలం పెండింగ్ బకాయిలు తీర్చడానికే తాము కొత్తగా పదవుల్లోకి వచ్చామా అంటూ కొత్త సర్పంచ్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.పెండింగ్ నిధుల్లో కేంద్రం కొంత మాత్రమే విడుదల చేయడం.. నిధుల విషయంలో కొత్త, పాత సర్పంచ్‌ల విషయంలో ఈ ఉద్రిక్తత తలెత్తడంతో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను.. తాజాగా విడుదలైన నిధుల నుంచి చెల్లించాలని మంత్రి సీతక్క స్పష్టం చేసింది. అదే సమయంలో పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధుల్లో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో టెన్షన్



బీర్‌పూర్(జగిత్యాల): మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామం బీర్‌పూర్ బుధవారం రాత్రి టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు అగ్రనేత ఢిల్లీలో లొంగిపోతున్నాడని వార్తలు రావడంతో గ్రామంలో ఒకేసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. గ్రామంలోని వృద్ధులు, యువకులు, మహిళలు ఆసక్తితో టీవీల వద్ద కూర్చొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఉపా ధ్యాయుడిగా ఉండి ఉద్యమాల్లోకి వెళ్లిన గణపతి ఇప్పుడు ఎలా ఉన్నాడో చూడాలనే ఆత్రుతతో బీర్ పూర్ ప్రజలు ఎదురుచూస్తున్నారు.లొంగిపోవాలని గతంలోనే 'అంతర్మథనం'ముపాల లక్ష్మన్‌రావ్ అలియాస్ గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్ గ్రామంలో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆద్వ ర్యంలో అంతర్మథనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసం దర్భంగా గ్రామంలో ఎస్పీ శివకుమార్ బస చేశారు. వేదికపై గణపతి లొంగిపోవాలని జనస్రవంతిలో కలవాలని ఎస్పీ ఆహ్వానించారు.

# హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం.. భవనంపై నుంచి పడి ముగ్గురు మృతి.



హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని టోలీచౌక్ ప్రాంతంలో గురువారం ఒక ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఒక భవనంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి నలుగురు భవన నిర్మాణ కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. భవనం ఐదో అంతస్తులో పనులు చేస్తున్న సమయంలో అదుపు తప్పి కింద పడటమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు వదలగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర చికిత్స అందు తోంది. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.నిర్మాణ రంగంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు ఎంతో ఎత్తులో పనిచేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ప్రాణనష్టం సంభవిస్తోంది. ఈ

# తెలంగాణ మహిళలకు సర్కార్ శుభవార్త.. ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు, ఫ్రీ హెల్త్ చెకప్‌లు



హైదరాబాద్ :తెలంగాణలో మహిళా శక్తికి ఆరోగ్య భరోసా కల్పించేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ కీలక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో తయారు చేసిన హెల్త్ మిషన్-100 (100 రోజుల ఆరోగ్య మిషన్) కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఆ రోజు నుంచి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ హెల్త్ మిషన్-100లో భాగంగా ప్రధానంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. మహిళా దినోత్సవం నాడు ప్రత్యేకంగా మహిళలకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు.మరీ ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళలు పడే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం.. వారికి ఎలాంటి ఖర్చు లేకుండా అత్యాధునిక డయాగ్నోస్టిక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని రేవంత్ రెడ్డి సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ఈ వైద్య పరీక్షలను వచ్చే 6 నెలల పాటు కొనసాగించనున్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు.రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. సెర్ప్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఉన్న సుమారు 42 లక్షల నుంచి 46 లక్షల మంది మహిళలకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి కల్పించనున్నారు. ప్రతి మహిళకు టీ-డయాగ్నస్టిక్స్ నెట్‌వర్క్ ద్వారా దాదాపు 30 రకాల ముఖ్యమైన మెడికల్ టెస్ట్‌లను ప్రభుత్వం ఫ్రీగా చేయనుంది. కేవలం సాధారణ వైద్య పరీక్షలకే పరిమితం కాకుండా.. మహిళలకు వచ్చే ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించేందుకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను కూడా ఈ మెడికల్ టెస్టుల్లో చేర్చారు. ఈ మొత్తం స్క్రీనింగ్ ప్రక్రియను 4 దశల్లో విభజించి.. రానున్న 6 నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..